క్లుప్తంగా

నేడు సైన్స్ ఎగ్జిబిషన్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు కుముదవల్లి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డీఆర్‌డీఓ, ఐసీఎస్ఆర్‌ల నుంచి శాస్త్రవేత్తలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భౌతికశాస్త్ర అధిపతి ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

తైక్వాండోలో జాతీయస్థాయి పతకాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ (గార్డెనీయా గ్రోవ్ విల్లాస్ రాంకీ డీస్కవరి సిటీ) చిన్నారులు తైక్వాండోలో జాతీయ స్థాయి పథకాలను సాధించారు. కాలనీకి చెందిన చిన్నారులు ధ్రువ, హవిశ్ శుక్రవారం రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరిగిన ఇండియా తైక్వాండో పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 2వ సబ్ జూనియర్, కెడెట్ జూనియర్ ఇండియా తైక్వాండోలో టీమ్ పూమ్స్ సబ్ జూనియర్ విభాగల్లో రాణించారు. ఇందులో ధ్రువ, హవిశ్ క్యాంస పథకాలను సాధించారు. జాతీయ స్థాయిలో పథకాలను సాధించిన చిన్నారులను మాస్టర్ విజయ్, కుటుంబ సభ్యులు, నిర్వాహకులు అభినందించారు.

తాండూరు కంది పప్పునకు ప్రత్యేక గుర్తింపు

మహేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ పాండు యాదవ్

మహేశ్వరం: దేశంలో తాండూరు కంది పప్పునకు ప్రత్యేక గుర్తింపు ఉందని మహేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్ పాండు యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నాణ్యమైన తాండూరు కంది పప్పును విక్రయిస్తున్నామని, వినియోగదారులు కొనుగోలు చేయాలని సూచించారు. ఇటీవల మండల కేంద్రంలో కంది పప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కంది పప్పును 10 కిలోలు రూ.1,700, 30 కిలోలు రూ.4,800 ధరలో అందుబాటులో ఉందన్నారు.

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణతో పూజలు నిర్వహించారు. శివుడికి అభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, ఆలయ పూజారులు పలువురు పాల్గొన్నారు.

అభయహస్తం దరఖాస్తులపై విచారణ



లబ్ధిదారులను విచారిస్తున్న కమిషనర్ సుమన్‌రావు

బడంగ్‌పేట్: అభయహస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, మేనేజర్ నగేశ్, సిబ్బంది శుక్రవారం విచారణ చేపట్టారు. దరఖాస్తు చేసుకున్నప్పుడు తప్పులు దొర్లడంతో పాటు రేషన్‌కార్డు నంబర్, ఫోన్ నంబర్ తదితర అంశాలను సరిచేసి లాగిన్ చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బందికి లబ్ధిదారులు సహకరించాలని అధికారులు కోరారు.

క్రీడోపై విద్యార్థులకు అవగాహన

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని లార్డ్స్ ఒలంపియాడ్‌లో శుక్రవారం క్రీడోపై ప్రైమరీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యాసంస్థల చైర్మన్ బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి క్రీడో కార్యక్రమాలు ప్రారంభించారు. విద్యా ప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని బోధనలో నైపుణ్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటునట్లు బీరప్ప తెలిపారు. కార్యక్రమంలో డీన్ సతీష్‌కుమార్ ప్రిన్సిపాల్ సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి రేఖా సాగర్, క్రీడో ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చల్లగా చూడు పెద్దమ్మ

ప్రకృతి ఒడిలో గరిగుట్ట భక్తులను పులకరింపజేస్తోంది. ఎత్తయిన కొండలు, ఎత్తైన వృక్షాలు, పక్షుల కిలకిలారావాల మధ్య వెలసిన గరిగుట్ట పెద్దమ్మ భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఏటా అమ్మవారికి కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మూడు రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

జాతరకు సిద్ధమైన జల్‌పల్లి గరిగుట్ట ఆలయం

- నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మాదన్నగూడలోని చారిత్రాత్మకమైన గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి ఆలయం కల్యాణ మహోత్సవాల (జాతర)కు సిద్ధమయ్యింది. మూడు రోజుల పాటు కన్నుల పండువగా ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయాన్ని జాజు, సున్నంతో అలంకరించారు. ఈ జాతరకు జల్‌పల్లితో పాటు శ్రీరాం కాలనీ, మామిడిపల్లి, పహాడీషరీఫ్, చాంద్రాయణగుట్ట, సరూర్‌నగర్, బాలాపూర్, కాటేదాన్, మధుబన్ కాలనీ, గగన్‌పహాడ్‌ల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మంచినీరు, పారిశుద్ధ్య సమస్య లేకుండా తలెత్తకుండా మున్సిపాలిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు.



గరిగుట్ట పెద్దమ్మ ఆలయం

దట్టమైన అడవిలో కొలువైన ఆలయం

జల్‌పల్లి గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో దట్టమైన మాదన్నగూడ అటవీ ప్రాంతంలో గరిగుట్టపై పెద్దమ్మ కొలువుదీరింది. వనసంపద మధ్య వెలసిన అమ్మవారితో పాటు ఆలయ పరిసరాల్లో సమ్మక్క, సారక్కల గద్దెలు నెలకొల్పారు. అడవులకు రక్షణగా ఉండేలా ఈ అమ్మవార్ల గద్దెలను ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. అమ్మవారి కుడి భాగంలో కొండపైన ఆంజనేయ స్వామి విగ్రహం ఉంది. దీనికి సమీపంలోనే కొండలపై రెండు గుండం (కోనేరు)లు ఉన్నాయి. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజున ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి ఏడాది ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కరన్‌కోట కిషన్‌బాబా తమ పెద్దల నుంచి వారసత్వంగా తీసుకొని ఆలయంలో పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన కుమారుడు విఠల్‌బాబా మూడు దశాబ్దాల నుంచి పర్యవేక్షిస్తున్నారు.

ఆలయాన్ని నిర్మించిన మాదన్న

తానీషా హయాంలో మహేశ్వరం ప్రాంత వాసి మాదన్న ఉన్నత పదవిలో ఉండేవారని, ఆయన ఈ అటవీ ప్రాంతం నుంచి వెళ్లే క్రమంలో శిబిరంలో నిద్రిస్తుండగా అమ్మవారు కలలో ప్రత్యక్షమై ఆదేశించడంతో అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. అందువల్ల ఈ ప్రాంతాన్ని మాదన్నగూడ అని పిలుస్తారని జల్‌పల్లి వాసులు చెబుతున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా జల్‌పల్లి గ్రామ ప్రజలు ఇంటి ఆడపడుచులు, బంధువులను ఆహ్వానిస్తారు.

వైభవంగా నిర్వహిస్తాం



గరిగుట్ట పెద్దమ్మ కల్యాణ మహోత్సవ జాతర నేటి (శనివారం) నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. జాతర సందర్భంగా భారీగా తరలి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీస్, మున్సిపాలిటీ శాఖలు తగిన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా అటవీ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలి. – దూడల శ్రీనివాస్ గౌడ్, జల్‌పల్లి

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు

మహేశ్వరం: రావిర్యాల గ్రామం నుంచి మహేశ్వరం మోడల్ స్కూల్ వరకు విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సును నడుపుతామని మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం ఆర్టీసీ బస్సు డిపోలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు డీఎంను కలిసి రావిర్యాల– మహేశ్వరం మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిర్యాల, సర్దార్‌నగర్, తుక్కుగూడ, మంఖాల్, హర్షగూడ,, సిరిగిరిపురం, మహేశ్వరం మోడల్ స్కూల్ వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సును త్వరలో నడిపిస్తామన్నారు. ఈ గ్రామాల్లో 200 మంది విద్యార్థులు చదువుతున్నారని, విద్యార్థులు బస్సు సౌకర్యం లేక సమయానికి రాలేకపోతున్నారన్నారని, సాయంత్రం ఇంటికి చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ తెలిపారు. బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిన డీఎంకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పరమేశ్, వాసు, అంజలి పలువురు పాల్గొన్నారు.



మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధనుంజయ్, ఉపాధ్యాయులు

కాంగ్రెస్ బాచుపల్లి గ్రామ కమిటీ ఎన్నిక

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీని శుక్రవారం ప్రకటించారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా చెవులపల్లి కృష్ణ రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాఘవేందర్, హరీశ్‌గౌడ్, బూత్ అధ్యక్షులుగా యుగంధర్‌రెడ్డి, రాజశేఖర్, బూత్ ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, నవీన్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా విజయ్‌కుమార్, కార్యదర్శులుగా రాములు, శంకరయ్య, కోశాధికారిగా సుధాకర్, ప్రచార కార్యదర్శులుగా మల్లేశ్, శ్రీశైలం, అంజయ్య, నరేందర్, ఎస్సీ, బీసీ, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా యాదయ్య, గణేశ్‌గౌడ్, వలిగి కృష్ణ, సలహాదారులుగా సుదర్శనాచారి, పాండురంగారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌గా విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహేశ్, సీహెచ్ రాజు, మహేందర్, జగన్, శ్యామల రవి, శ్రీను, కుమార్, ధనుంజయ్, నాగేశ్, పెద్ద యాదయ్య, శ్రీశైలం, రాజశేఖర్, కృష్ణయ్యగుప్తా, ముత్యాలు, శ్రీను, శంకరయ్య, కుమార్, జాన్, అనిల్, నరేశ్, ఎం.రాజు, దేవేందర్‌గౌడ్, శ్రీనివాస్, పవన్, కె.మహేందర్, శేఖర్, శివ, శేఖర్‌గుప్తా, శశికుమార్, ఎండీ సయ్యద్‌బాబా, ఇ.కృష్ణ, నాగేష్‌గౌడ్, ఎ.మల్లేశ్, ఎ.శ్రీనివాస్, లక్ష్మయ్యను సభ్యులుగా ఎన్నుకున్నారు.



కృష్ణ, కాంగ్రెస్ బాచుపల్లి అధ్యక్షుడు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మీర్‌పేట: ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని జిల్లెలగూడ గీతాంజలి లయన్స్‌క్లబ్ సభ్యుడు వంటేరు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఓల్డ్ గాయత్రీనగర్‌లోని శారదా లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో ఓజోన్, నేత్రాలయ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 500 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మహేందర్‌రెడ్డి, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బీరం రాజేశ్వర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు వెంకట్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని 31, 35 డివిజన్ల కార్పొరేటర్లు విజయలక్ష్మి, సౌందర్య శుక్రవారం కమిషనర్ వాణికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సర్వే నం 119లో రోడ్డుపై సెట్‌బ్యాక్ లేకుండా సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారని, దీంతో పాటు అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని తెలిపారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదులు చేసినప్పటికీ, నోటీసులు ఇచ్చామని చెప్పి చేతులు దులుపుకుంటూ.. పరోక్షంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని కమిషనర్‌కు వివరించారు. వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కోరారు.



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్లు

భూ కబ్జాదారులను వదిలిపెట్టం

- అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తాం
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్
- కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మహేశ్వరం: ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములను కబ్జా చేసినా.. సహకరించినా వదిలిపెట్టమని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో అసైన్డ్ భూములను బీఆర్ఎస్ నేతలు పట్టా భూములుగా మార్చుకొని రిజిస్ట్రేషన్ చేసి అక్రమాలు పాల్పడుతున్నారని ఆరోపించారు. హైకోర్టు స్టే ఆర్డర్‌లో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయించి.. హెచ్ఎండీఏ లే అవుట్‌లకు అనుమతులు ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చెరువుల సుందరీకరణ పేరుతో భూములను కబ్జా చేసి విక్రయించారని తెలిపారు. కుంటలు, వాగులను కూడా వదలేదని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కాంగ్రెస్ పార్టీ నేతలను కూడా వదలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల వెలికితీసి పేదలకు పంపిణీ చేస్తామని ప్రకటించారు. అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తామని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

నియోజకవర్గంలో 540 బూత్‌ల ఇన్‌చార్జిలను ఎన్నుకొని, గ్రామ, మండల, మున్సిపల్, డివిజన్, కార్పొరేషన్ పార్టీల అధ్యక్షులను నియమిస్తామన్నారు. ఇప్పటి వరకు 70 శాతం కమిటీలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. 60 ఓట్లకు ఒక ఇన్‌చార్జిని నియమించి పార్టీ బలోపేతానికి కోసం కృషి చేస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో మెజార్టీ సాధించేలా పనిచేస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

పూర్వ వైభవం తెస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని కేఎల్లాఆర్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు అంగీకారంతో పార్టీలో చేర్చుకుంటామన్నారు. మహేశ్వరంలో పార్టీకి పూర్వవైభవం తీసుకోస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మర్యాద మురళిధర్‌రెడ్డి, రమేశ్, రాజిరెడ్డి, సత్తయ్య పలువురు పాల్గొన్నారు.

కేఎల్లార్‌కు వినతి

కందుకూరు: మండలానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించేలా చొరవ తీసుకోవాలని కేఎల్లాఆర్‌ను మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఎంపీపీ మంద జ్యోతి పాండు, వైస్ ఎంపీపీ శమంతతో పాటు పలువురు ఆయనను కలిసి విన్నవించారు. నాలుగేళ్లుగా ఎంపీటీసీలకు సరైన బడ్జెట్ కేటాయింపులు లేక గ్రామాల్లో పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. రెండేళ్ల క్రితం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.1.60 కోట్లు మంజూరు చేయించారని, వాటికి అనుమతులు ఇప్పించాలని కోరారు. దీనిపై ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి వెంటనే అనుమతులు ఇప్పిస్తానని కేఎల్లార్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎంఈ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు బాబు, నారాయణ పాల్గొన్నారు.



కేఎల్లార్‌ను కలిసిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ

అడ్డగోలు తవ్వకాలు



హస్తినాపురం ఈస్ట్‌లో పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్డు

- పలుచోట్ల బాగున్న రోడ్లకే మళ్లీ మళ్లీ మరమ్మతులు
- ప్రజాధనం వృథా

వనస్థలిపురం: రాజుల సొమ్ము రాళ్లపాలు... జీహెచ్ఎంసీ డబ్బులు రోడ్లపాలు అనుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. పలు కాలనీల్లో అభివృద్ధి పనుల పేరిట బాగున్న రోడ్లను తవ్వడం, ఆపై రోడ్లు వేయడం, ఏడాదో, రెండేళ్లో గడవగానే డ్రైనేజీ మరమ్మతులు, పైప్‌లైన్ల కోసమని తిరిగి రోడ్లను తవ్వడం.. మళ్లీ వేయడం పరిపాటిగా మారింది. శివారు కాలనీల్లో ఇప్పటికీ పలు ప్రాంతాల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నా వాటిని పట్టించుకోని అధికారులు అభివృద్ధి చెందిన చోటే రోడ్లు తవ్వి.. తిరిగి వేస్తూ ప్రజా సొమ్మును వృథా చేస్తున్నారని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

- ◆ వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం ఈస్ట్‌లో ప్రధాన రోడ్డులో వర్షాకాలంలో నీరు నిలిచి గుంతలు పడటంతో ఇటీవల కొత్తగా సీసీ రోడ్డు వేశారు. కాగా మళ్లీ పైప్‌లైన్ కోసం బాగున్న రోడ్డును తవ్వేశారు.
- ◆ వనస్థలిపురం డివిజన్ శ్రీనివాసపురం కాలనీలో ప్రధాన రహదారిలో కొత్తగా సీసీ రోడ్డు వేయడానికి అడ్డంలా ఉన్న రోడ్డును జేసీబీలతో తవ్వేశారు. దీంతో ఆ దారిన వెళ్లాల్సి వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- ◆ బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం డివిజన్లలో ఇంకా పలు కాలనీల్లో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. మట్టిరోడ్లను బీటీ, సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, అభివృద్ధి చెందిన కాలనీల్లోనే మళ్లీ మళ్లీ రోడ్లను వేస్తున్నారని పలు కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.
- ◆ సంపన్నులు, రాజకీయ పలుకుబడి గల వ్యక్తులు నివాసం ఉండే కాలనీల్లోని రోడ్లపై చిన్న గుంత పడినా, డ్రైనేజీ సమస్య వచ్చినా వెంటనే మరమ్మతులు చేపడుతున్నారని, శివారు కాలనీలను జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.
- ◆ కాలనీల్లో మొదట మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు పూర్తయిన తర్వాత రోడ్లను వేయాల్సి ఉండగా, ఇష్టారీతిన రోడ్లను వేసి.. మళ్లీ పైప్‌లైన్ల మరమ్మతుల కోసం వాటిని తవ్వుతూ తిరిగి వేస్తూ కాంట్రాక్టర్లకు లాభం చేకూరుస్తూ అధికారులు తాము కూడా లబ్ధి పొందుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.
- ◆ ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీల్లో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు పూర్తయిన తర్వాతే రోడ్లను నిర్మించాలని, అప్పుడే ఆ రోడ్లు చాలా కాలం చెక్కు చెదరకుండా ఉంటాయని, ప్రజాధనం కూడా వృథా కాదని ప్రజలు అంటున్నారు.

ఘనంగా అమావాస్య హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని నిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని గురూజీ బ్రహ్మశ్రీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో శుక్రవారం హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్ణాహుతి కూడా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజీ 23, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 20, దొండ 28-43, చిక్కుడు 23-40, గోకర 45, బీట్‌రూట్ 20, క్యాప్సికం 60, ఆలు 21-23, దోస 23, సొర 11, పొట్ల 15, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 55. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ కన్వీనర్ రాములు

ఇబ్రహీంపట్నం: ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మండల సీఐటీయూ కన్వీనర్ బుగ్గరాములు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీఓ లక్‌పతినాయక్‌కు శుక్రవారం ఆయన కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ప్రమాద బీమా రూ.10లక్షలు కల్పించాలని, వారాంతపు సెలవులతోపాటు జాతీయ సెలవులను కార్మికులకు అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కోశాధికారి దేవదాసు, జిల్లా నాయకులు నరేష్, మల్లేష్, యాదయ్య, ఐలయ్య, రాజశేఖర్, బాల్‌రాజ్, కిషన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించండి

తలకొండపల్లి: కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 16న నిర్వహించనున్న భారత బంద్‌ను విజయవంతం చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల (జీఎంపీఎస్) సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన తలకొండపల్లిలో మాట్లాడారు. 16న మండలంలో దుకాణదారులు స్వచ్ఛందంగా షాపులు మూసివేయాలని కోరారు. బంద్‌కు అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి

మాడ్గుల: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే ఐక్యతా ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని అర్కపల్లి, అవురుపల్లి, కొలుకులపల్లి, నాగిళ్ల, మాడ్గుల ప్రభుత్వ పాఠశాలలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మెన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందించిన స్కాన్ అండ్ లెర్న్ పుస్తకాలను శుక్రవారం ఆ ఫౌండేషన్ సభ్యులు పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాన్ అండ్ లెర్న్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించామన్నారు. పాఠ్య పుస్తకాల్లో ఉన్న పాఠాలను విభజించి ఒక్కో పాఠానికి క్యూఆర్‌కోడ్ రూపొందించి ఆ పాఠం యొక్క సారాంశం, క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వీడియోల రూపంలో విద్యార్థులకు అందుతుందని తెలిపారు. దీంతో విద్యార్థులు పాఠాలను సులభంగా అర్థం చేసుకోగలుగుతారన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సభ్యులు